20

## తోసెయ్, తోసెయ్
## THROW...ఇక,

మనిషి తన సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో గొర్రెల్ని చూశాడు. ఎంత దూరం వెళ్ళినా గొర్రెలే. స్వేచ్ఛగా పచ్చిక బయళ్ళలో తింటూ తిరిగే గొర్రెలు కావవి. కాళ్ళకు గొలుసులు, తోకలకు గొలుసులు, ముక్కుకు, నోటికీ గొలుసులు. కంటి చూపుకు గొలుసులు.

మనిషి ఎంతో బాధ పడ్డాడు- తనకీ గొర్రెల కాపరి పదవి ఎందుకూ? తనూ ఓ గొర్రయి పోయేకన్న, గొర్రెల్ని మనుషులుగా మారిస్తే ఎంత బావుంటుంది?- అన్న ఆలోచన....బావుందనిపించింది!

తిండి కంటే గొప్పది స్వేచ్ఛ! స్వేచ్ఛలేని బతుకెందుకూ? అని అనుకుని గొర్రెల్ని ఉద్దేశించి "పెరిస్ THROW ఇక" అని అరిచాడు.

గొర్రెలన్నీ 'యకా- యకా' అని తలలాడించాయి.

ఇనుప గొలుసులు పట పట మని తెగిపోయిన చప్పుడయ్యింది- మనిషివైపు ఆరాధనా భావంతో చూశాయి.

తమను ఉద్ధరించడానికి వచ్చిన మహామనిషివి నీవే నన్నాయి.

"కామ్రేడ్స్ మనమీనాడు స్వేచ్ఛ గురించి మాట్లాడుకుందాం"- అన్నాడు మనిషి. పిడికిలి బిగించి చెయ్యి పైకెత్తాడు.

"ష్- చెయ్యి దించు. పిడికిలి తెరువ్"- అన్నాయి గొర్రెలు ఏక కంఠంతో.

"ఎందుకూ?"- ఆశ్చర్య పొయ్యాడు మనిషి.

"ప్రపంచ శాంతి నీ అరచేతిలో ఉందటకదా? చూపవా అబ్బ ఒక్కసారి చూపవా- కాసేపు ఆడుకుంటాం చూపవా?.... పిడికిట్లో పిసికి పెడతా వెందుకూ? విప్పిచూపవా?"-అని గారాబాలు పొయ్యాయి గొర్రెలు. మనిషి మంచివాడు. వెర్రి బాగులవాడు. గొర్రెలు మనుషులైతే చాలు ఏ త్యాగమైనా చేద్దామనుకున్నాడు.

"ప్రియమైన గొర్రెలారా! మీ బతుకు దుర్భరమై పోయింది. నాకు తెలుసు. మీరెంత కాలం ఈ గడ్డి తింటారు? ఎంత కాలం ఊపిరి పీల్చకుండా ఉంటారు. మీ విమోచనే నా ధ్యేయం! అందుకు ఏ త్యాగమైనా చేస్తాను. పెరిస్ **THROW**....ఇక- అన్నాడు మనిషి. "మరి మీరేం చేస్తారు? సహకరిస్తారా?"- అని ముద్దుగా అడిగాడు.

"చేస్తాం. చేస్తాం. నిన్నే త్యాగం చేస్తాం"- అందో గొర్రె. ఒక్క గొర్రె గొంతులో లక్షల గొర్రెల గొంతులు పలికాయి. "నెట్టేయండి.... త్రో, త్రో.... **THROW** ఇక! పెరిస్- **THROW** ఇక.... బుజ్జి ముండలు. గొర్రెలు అమాయకమైనవి. వాటికేమీ తెలియదు-" అనీ అనుకున్నాడు మనిషి.

"ఛ ఛ- అలా కాదర్రా. అలా అనకూడదు. నేనే మీ విమోచకుణ్ణి. ఏదీ నాలిక చాపండి! విమోచన మంత్రం వేస్తాను"- అని ఓ పెద్ద గొర్రెను దగ్గరికి లాక్కున్నాడు. "నీ **GLOSSA** ఏదీ" అడిగాడు ప్రేమగా.

తెల్ల మొహం వేశాయి గొర్రెలు-

"గ్లోసా అంటే తెలియదూ? జిహ్వా. నాలిక. మీ అజ్ఞానం అలా ఉంది. సరే, నాలిక చాపు" అన్నాడు.

ఓ పెద్ద గొర్రె నాలిక చాపింది.

గ్లోస్ నాస్త్- అని రాశాడు మనిషి. గొర్రెలన్నీ "మస్తు మస్తు" అని మురిసి పొయ్యాయి. అబ్బ ఎంత తీపిగా ఉన్నాయి. ఈ అక్షరాలు- అని ఆనంద బాష్పాలు రాల్చాయి.

ఆకాశం పగిలినట్లు చప్పుడైంది. ఉరుములు, మెరుపులు, ప్రపంచ మంతటా ఎరుపు, నీలం రంగు విద్యుద్దీపాలు వెలిగాయి. ఆరిపొయ్యాయి. మళ్ళీ వెలిగాయి. మళ్ళీ ఆరిపొయ్యాయి. మళ్ళీ.... ఇంతలో అశరీరమెరికా వాణి చెప్పింది-

"ఓహో మానవుడా! జాతి విమోచకుడా! చరిత్ర రిజిష్టర్లో నీ స్థానం సుస్థిరంగా ఉందయ్యా. అది ఇక ఏ ఇంకు రిమూవర్‌కూ ఎగిరి పోదు. అయితే నువ్వు చెయ్యాల్సిన పనొకటుంది. నీ కుర్చీ కింద అణు ఆయుధాల వి.ఐ.పి. బ్రీఫ్‌కేస్ జాగ్రత్త! కుర్చీ కిందికి నీళ్లొచ్చినా రావొచ్చు-"

మనిషి నమ్మలేదు-

"అణు ఆయుధాల ఎర్రబటన్ గొర్రెల కెందుకూ? వాటికేదో ఇంత పౌష్టికాహారం చాలు-" అనుకున్నాడు మనిషి.

అయితే ఆహారమూ అందించ లేకపొయ్యాడు-

అంతకు ముందున్న గడ్డి కూడా లేదు.

గొలుసులు విడిపొయ్యాయి. చూపులు స్వేచ్ఛగా వీచాయి. మాటలు జోరుగా సాగాయి. కాళ్ళకు ముందు బంధనాలు లేవు. స్వేచ్ఛలో మునిగి, స్వేచ్ఛలో తేలి, గొర్రెలు స్వేచ్ఛగా.... ఆకలితో అలమటించాయి!

అన్నం పెట్టకుండా స్వేచ్ఛనిచ్చిన వాడెవడా- అని మనిషిపై గొర్రెలు మండి పడ్డాయి. పళ్ళు నూరాయి. కాళ్ళ గిట్టలు పదునెక్కించుకున్నాయి. దెబ్బయేళ్ళ తర్వాత గొర్రెలు స్వేచ్ఛగా ఆలోచించాయి. స్వేచ్ఛ ప్రసాదించిన వాణ్ణి, తొలగించే స్వేచ్ఛ తమకుందని గ్రహించాయి.

ఒక్క ఉదుటున అన్ని వైపుల నుండి మనిషి పైకి లఘించాయి. మనిషి అయోమయమై పోయ్యాడు. తన కత్తి కింద తానే పడ్డట్టు, తన ఆలోచనలతో తననే పేల్చుకుని, ఆత్మహత్య చేసుకున్నట్టు; మనిషి, తను ప్రసాదించిన స్వేచ్ఛ కాళ్ళకింద తనే పడి నలిగిపోయ్యాడు.

చరిత్ర గమనించింది. 'మార్పు, మార్పు- సహజం'....అని తన పుటను తిప్పేసుకుంది.

గొర్రెలు గుంపులు గుంపులుగా విడిపోయ్యాయి.

మనిషి జీవితంలో దేన్నో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకుతూనే ఉన్నాడు.

○

(గొర్రెలకు క్షమాపణ చెపుతూ-
సోవియట్ రష్యాలో గోర్బచెవ్ ప్రభుత్వం కుప్పగూలిన నేపథ్యంలోంచి-)
మార్చి 1992